ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 5
గురువారం 26 సెప్టెంబరు 2024
జిల్లాల వార్తలు



విరబూసిన బ్రహ్మకమలం

నారాయణఖేడ్ పట్టణవాసి వీరేశలింగం గృహంలో మంగళవారం అర్ధరాత్రి అరుదైన బ్రహ్మకమలం విరబూసింది.
-నారాయణఖేడ్





వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తులు

నారింజ వాగులో వ్యక్తి గల్లంతు

ఫలించని అధికారుల గాలింపు చర్యలు

జహీరాబాద్, సెప్టెంబరు 25 : మండల పరిధిలోని బూచనెల్లి-బరూర్ గ్రామాల మధ్య నారింజవాగు ప్రవాహంలో వ్యక్తి గల్లంతయ్యాడు. బూచనెల్లికి చెందిన ఇస్మాయిల్ కొన్నేళ్ల క్రితమే బీదర్‌లో స్థిరపడ్డారు. బీదర్‌కు చెందిన షాకీర్(40), ఇస్మాయిల్ కలిసి బుధవారం మధ్యాహ్నం బైక్‌పై బరూర్ మీదుగా జహీరాబాద్ వస్తున్నారు. నారింజ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో బూచనెల్లి-బరూర్ గ్రామాల మధ్య నారింజవాగు లోలెవల్ బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్నది. ప్రవాహ ఉధృతిని లెక్కచేయకుండా బైక్‌పై దాటేందుకు ప్రయత్నిస్తుండగా బైక్‌తో సహా కొట్టుకుపోయారు. వాగులో కొట్టుకుపోతున్న ఇస్మాయిల్‌కు మధ్యలో ఉన్న చెట్టు ఆసరా దొరకడంతో దానిని పట్టుకున్నాడు. రక్షించండని కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు చేరుకుని రక్షించారు. షాకీర్ నీటిలో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న స్థానిక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే కర్ణాటక పోలీసులకు, అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇస్మాయిల్‌ను బూచనెల్లిలో ఉన్న బంధువుల ఇంటికి తీసుకువెళ్లారు. జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఆర్‌ఐలు రుక్నోద్దీన్, యాదిలాల్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బూచనెల్లిలో ఉన్న ఇస్మాయిల్‌ను పరామర్శించారు. జహీరాబాద్, కర్ణాటక పోలీసులు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా షాకీర్ ఆచూకీ ఇంకా తెలియలేదు.

మండలానికో ఎంఈవో

సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు

- ఉత్తర్వులు జారీచేసిన సర్కారు
- దశాబ్దాల అనంతరం ప్రతీ మండలానికి ఎంఈవో
- గాడిలో పడనున్న విద్యా వ్యవస్థ



మెదక్‌అర్బన్/సంగారెడ్డిఅర్బన్, సెప్టెంబరు 25 : మండల విద్యాధికారులు లేక గాడితప్పిన పాఠశాలల పనితీరును మెరుగు పరిచేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. ఎంఈవోల కొరతను తీర్చేందుకు ఆయా పాఠశాలల పరిధిలోని సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఎఫ్‌ఏసీ బాధ్యతలను అప్పగిస్తూ.. పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఇదివరకే మండల విద్యాధికారులుగా కొనసాగుతున్నవారిని ఎంఈవోలు(ఎఫ్‌ఏసీ)గా యథాతథంగా కొనసాగిస్తూ.. ఎంఈవోలు లేని మండలాలకు సీనియర్ హెచ్‌ఎంలను ఎంఈవోలుగా నియమించారు. ఎంఆర్‌సీ కార్యాలయాల్లో బుధవారం ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించారు.

తీరిన కొరత.. తప్పిన పనిభారం

ఐదారు మండలాలకు ఒక్కరే ఎంఈవోగా పనిచేస్తున్న విధానానికి సర్కార్ స్వస్తిపలికింది. గతంలో 2005 తర్వాత ఎంఈవోల నియామకం నిలిచిపోయింది. ఉమ్మడి సర్వీస్ నిబంధనల సమస్య కారణంగా ఎంఈవోల పదోన్నతులు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఎంఈవో బాధ్యతలను సీనియర్లకు అప్పగించినా ఆ తర్వాత కోర్టు వివాదంతో 2011 నుంచి యథాస్థితి కొనసాగింది. ఇన్‌చార్జిలుగా ఉన్నవారే ఖాళీ అయిన మండలాలకు ఎంఈవోలుగా కొనసాగుతూ వస్తున్నారు. ఈమేరకు సమీక్షించిన సర్కారు హైకోర్టు తుది తీర్పుకు లోబడి సీనియర్ హెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా నియమకానికి చర్యలు తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 19 ఏళ్లుగా నెలకొన్న వివాదానికి తెరపడినట్లయింది. సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మెదక్ జిల్లాలో ముగ్గురు ఎంఈవోలు 21 మండలాల బాధ్యతలను చూస్తుండగా.. తాజా నిర్ణయంతో కొత్తగా మరో 16 మంది సీనియర్ హెచ్‌ఎంలు ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలో 12 మంది 28 మండలాల బాధ్యతలను చూడగా.. కొత్తగా 16 మంది నియమితులయ్యారు.

మరోవైపు సీనియర్ హెచ్‌ఎంలను ఎంఈవోలుగా నియమించకుండా జూనియర్ ఉపాధ్యాయులను మండల విద్యాధికారులుగా నియమించడం నిబంధనలకు విరుద్ధమని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించాయి. వెంటనే చర్యలు చేపట్టాని టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంగయ్య, వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో డీఈవో రాధాకిషన్‌కు వినతి పత్రం అందజేశారు.

మెదక్ జిల్లా ఇన్‌చార్జి ఎంఈవోలు

మండలం	పేరు
మెదక్	నీలకంఠం
వెల్దుర్తి	యాదగిరి
శివ్వంపేట	బుచ్యానాయక్
హవేళీఘణపూర్	మధుమోహన్
అల్లాదుర్గం	ధనుంజయ
నర్సాపూర్	తారాసింగ్
కౌడిపల్లి	బాలరాజ్
కొల్చారం	సత్యనారాయణ
చిలప్‌చేడ్	విఠల్
తూప్రాన్	సత్యనారాయణ
మాసాయిపేట	ధర్మపూరి
మనోహరాబాద్	మల్లేశం
చేగుంట	నీరజ
నార్సింగి	రామకృష్ణ
చిన్నశంకరంపేట	పుష్పవేణి
రామాయంపేట	శ్రీనివాస్
నిజాంపేట	యాదగిరి
పాపన్నపేట	ప్రతాప్‌రెడ్డి
టేక్మాల్	సుజాత
పెద్దశంకరంపేట	వెంకటేశం
రేగోడ్	గురునాథ్

సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఎంఈవోలు

మండలం	పేరు
అమీన్‌పూర్	టి.సుధాకర్
అందోల్	కృష్ణ
చౌటకూర్	కృష్ణారెడ్డి
గుమ్మడిదల	రాంబాబు
హత్నూర	వెంకటనర్సింహులు
ఝరాసంగం	దామోదర్
జిన్నారం	కుమారస్వామి
కల్హేర్	శ్రీనివాసులు
కంది	జోగప్ప
కంగ్టి	రహీముద్దీన్
కోహీర్	జాకీర్ హుస్సేన్
కొండాపూర్	దశరథ్
మనూర్	రాజశేఖర్
మొగుడంపల్లి	జాఫర్‌అలీ
మునిపల్లికి	భీమ్‌సింగ్
నాగల్‌గిద్ద	హీరామ్యాన్
నారాయణఖేడ్	విశ్వనాథ్
నిజాంపేట	రాములు
న్యాల్‌కల్	మారుతి
పటాన్‌చెరు	నాగేశ్వర్‌నాయక్
పుల్‌కల్	శంకర్
ఆర్సీపురం	పీపీ రాథోడ్
రాయికోడ్	అంజయ్య
సదాశివపేట	శంకర్
సంగారెడ్డి	విద్యాసాగర్
సిర్గాపూర్	నాగారం శ్రీనివాస్
వట్‌పల్లి	గోవింద్‌రెడ్డి
జహీరాబాద్	బస్వరాజ్

2008 డీఎస్సీ అభ్యర్థులు.. ఇక కాంట్రాక్టు టీచర్లు

- నియామకానికి సర్కారు గ్రీన్‌సిగ్నల్
- 292 మంది అభ్యర్థులకు ఊరట

7లో

అప్రెంటీస్ మేళాకు పోటెత్తారు..



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన అప్రెంటీస్ మేళాకు అభ్యర్థులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వెయ్యి మంది అభ్యర్థులు హాజరయ్యారు. దీంతో ఐటీఐ ప్రాంగణం కిక్కిరిసింది. కంది మండలం ఎద్దుమైలారంలోని ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్)లో అప్రెంటీస్ చేసేందుకు ఐటీఐ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 361 మందిని ఎంపిక చేసినట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు తెలిపారు.
-సంగారెడ్డిఅర్బన్

మహిళా సాధికారతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

13,063 మహిళా సంఘాలకు రూ.214 కోట్ల రుణాలు

సంఘాల్లో వంద శాతం అక్షరాస్యత సాధించాలి : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25: మహిళా సాధికారతే లక్ష్యంగా జిల్లా సమాఖ్య ముందుకు సాగుతున్నదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్ టీఎన్జీవో బుధవారం భవన్‌లో నిర్వహించిన మహిళా సంఘాల వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 13,063 మహిళా సంఘాలకు 2024-25 సంవత్సరానికిగాను రూ.214 కోట్ల రుణాలు అందజేసినట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు వంద శాతం అక్షరాస్యతను సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా సమాఖ్య ద్వారా అమలు చేసిన కార్యక్రమాల నివేదికను చదివి వినిపించారు. 2023-24లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మెదక్, హవేళీఘణపూర్, తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నర్సాపూర్ మండలాల అధ్యక్షులలతోపాటు ఏపీఎంను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాసరావు, జిల్లా మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేగుంట సమాఖ్యకు అభినందన

చేగుంట, సెప్టెంబరు 25 : చేగుంట మండల మహిళ సమాఖ్యను కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రత్యేకంగా అభినందించారు.జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహిళ సమాఖ్య వార్షిక సమావేశంలో చేగుంట మండలం మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సునీతను ఆయన సన్మానించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సభ్యులకు అందేలా చూస్తున్నారని పేర్కొన్నారు. మహిళాశక్తి పథకం అమలులో చురుకుగా పని చేస్తున్నారని, జిల్లాలోనే తొలిసారి మదర్‌బర్డ్ యూనిట్‌ను గ్రౌండింగ్ చేయడంతో పాటు 'నా మొక్క.. నా బాధ్యత కార్యక్రమాన్ని ముందుగా ప్రారంభించినందుకు అభినందించారు. ప్రతీ మండల సమాఖ్య ఇలాగే చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మెదక్ మెడికల్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రారంభం

రెండో రౌండ్ నేషనల్ పూల్ కౌన్సెలింగ్‌లో అడ్మిషన్ తీసుకున్న ఏడుగురు విద్యార్థులు

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 25: మెదక్ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల అనుమతి పొందిన విషయం తెలిసిందే. అయితే ఈ సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ రవీంద్ర తెలిపారు. బుధవారం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండోరౌండ్ నేషనల్ పూల్ కౌన్సెలింగ్‌లో ఏడుగురు విద్యార్థులకు గానూ నలుగురు జీఎంసీ మెదక్‌లో, ఇద్దరు కేరళ నుంచి, ఒకరు హర్యానా, రాజస్థాన్ నుంచి వచ్చారన్నారు. కళాశాలకు కావాల్సిన అన్నిరకాల ప్యాకల్టీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందన్నారు. నిరుపేదలకు వైద్యమందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించి ఈ ప్రాంతవాసులు వైద్యసేవలను వినియోగించుకుని సహకరించాలని కోరారు.



విద్యార్థులకు కౌన్సిలింగ్ పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలా సాగుతున్నది..!

కంది పరిధిలోని సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శిక్షణ కలెక్టర్ మనోజ్ బుధవారం సందర్శించారు. సిబ్బంది విధుల నిర్వహణ, కొత్త డ్యాక్యుమెంట్లకు నంబర్లు ఇవ్వడం, ఇళ్లు, ప్లాట్లు, విల్లాలు, ఇంటి స్థలాలు, మ్యారేజ్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్లు ఎలా చేస్తారో ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ వల్లి సుబ్బలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. పటాన్‌చెరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ రవికాంత్, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ శేఖర్... రోజువారీ డాక్యుమెంటేషన్ ప్రక్రియను ఆయనకు వివరించారు.
-కంది, సెప్టెంబరు 25



'ధరణి' సమస్యలు పెండింగ్‌లో ఉండొద్దు

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



మునిపల్లి పీహెచ్‌సీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

మునిపల్లి, సెప్టెంబరు 25: ధరణి సమస్యలు పెండింగ్‌లో ఉండొద్దని, వెంటనే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రమైన మునిపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, మోడల్ స్కూల్, బుదేరా గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ గది, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రోగులకు మెరుగైన వైద్యమందించాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలన్నారు. తనిఖీలో భాగంగా గురుకుల కళాశాలలో శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, పచ్చదనం పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే కిచెన్‌రూమ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట తహసీల్దార్ ఆశాజ్యోతి, ఉప తహసీల్దార్ కృపానందం, ఎంపీవో అండాలమ్మ, డాక్టర్ రవి, ఆయూష్ డాక్టర్ అనుష, ఆర్‌ఐ సురేష్ తదితరులు ఉన్నారు.

అక్టోబరు 14 నుంచి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్

- సంగారెడ్డి ఎస్పీ రూపేష్
- జిల్లా పోలీసు కార్యాలయంలో అభ్యర్థుల ఎంపిక

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 25: అక్టోబరు 14 నుంచి 18వ తేదీవరకు రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ జరుగుతుందని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణలో జరుగనున్న మొదటి పోలీస్ డ్యూటీ మీట్ సందర్భంగా జిల్లాస్థాయిలో అధికారులు, సిబ్బందిలో ప్రతిభను వెలికితీసేందుకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏదైనా ఒక వస్తువును సీజ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ విధంగా భద్రపర్చాలన్న అంశాలపై ఎంపికలు జరిగాయని చెప్పారు. బాంబుస్క్వాడ్, నార్కొటిక్, ట్రాకర్ జాగిలాలను ఉపయోగించి ఏ విధంగా గుర్తించాలనే అంశాలను కూడా ఈ పోటీల్లో పొందుపరిచినట్లు ఎస్పీ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జోనల్‌స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభకనబర్చిన వారికి మెడల్స్‌తో పాటు నగదు బహుమతి, శాలరీల్లో బహుళ ఇంక్రిమెంట్ ఇస్తామన్నారు. ఈ పోటీలు జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు పర్యవేక్షణలో జరిగాయి.



పోటీలను పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు

కాంగ్రెస్ నాందేడ్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సురేష్‌షెట్కార్ నియామకం



ఎంపీ సురేష్‌షెట్కార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాందేడ్ జిల్లా నాయకులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 25: మహారాష్ట్రలోని నాందేడ్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలుపొందిన చవాన్ బలవంతరావు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో ఆ స్థానానికి త్వరలో ఉపఎన్నిక జరగనున్నది. ఈ నేపథ్యంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం నాందేడ్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించింది. బుధవారం షెట్కార్ అధ్యక్షతన నాందేడ్ పార్లమెంట్ పరిధిలోని నాందేడ్‌నార్త్, నాందేడ్‌సౌత్, బోకర్, నయాగాంవ్, డెగ్లూర్, ముఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఇన్‌చార్జిగా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమీక్షలో ఎంపీ సురేష్‌షెట్కార్ మాట్లాడుతూ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు బలవన్మరణం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విషాద ఘటనలు

7లో

'గీతం'లో ప్రపంచ ఫార్మాసిస్ట్ డే

- హాజరైన ఫార్మా రంగ నిపుణులు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు
- ఫార్మా రంగ అభివృద్ధి, విస్తరణ, ఉపాధి అవకాశాలపై చర్చ

7లో



మెదక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మాసిస్టులు

మెదక్‌లో ఫార్మాసిస్ట్‌ల ర్యాలీ

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 25: ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా బుధవారం ఛాంబర్ ఆఫ్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ (కోప) ఆధ్వర్యంలో ఫార్మసిస్టులు మెదక్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్టులు పాల్గొన్నారు. మెదక్ పట్టణంలోని బస్ డిపో నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ తొడుపునూరి రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫార్మాసిస్టులు ఐక్యం కావాలని, సమస్యల సాధనకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంగమేష్, మెదక్ ఏరియా అధ్యక్షుడు రాగం శ్రీనివాస్, కార్యదర్శి శేషాచారి, కోశాధికారి రాధా కిషన్, ఫార్మాసిస్ట్ కోఆర్డినేటర్ జుబేర్ అహ్మద్, ఫార్మాసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ మాఫియా, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25: రియల్ ఎస్టేట్ పేరిట మోసాలకు పాల్పడితే, ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎస్పీ ఉదయ్‌కుమర్‌రెడ్డి ఆయనకు పూలమొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు ఎస్పీ జిల్లా సమగ్ర సమాచారాన్ని పీపీటీ ప్రజంటేషన్ ద్వారా ఐజీకి తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్‌రెడ్డి, జిల్లా సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్యాస్ గోదాంను పరిశీలించిన తహసీల్దార్



ఎస్‌వీఆర్ గ్యాస్ గోదాంలో తూకం వేస్తున్న సిలిండర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

వెల్దుర్తి, సెప్టెంబరు 25: నిండుగా ఉన్న గ్యాస్ సిలిండర్ నుంచి ఖాళీగా ఉన్న సిలిండర్‌లో రీఫిల్ చేస్తున్న ఘటనపై తహసీల్దార్ కృష్ణ స్పందించారు. బుధవారం ఆర్ఐ జయభరత్‌రెడ్డి, సిబ్బందితో కలిసి స్థానిక ఎస్‌వీఆర్ ఇండెన్ గ్యాస్ గోదాంను తనిఖీ చేసి నిండు, ఖాళీగా ఉన్న గ్యాస్ సిలిండర్‌ను తూకం వేసి పరిశీలించి మాట్లాడారు. మంగళవారం దామరంచ గ్రామంలో జరిగిన ఘటనపై, గ్యాస్ గోదాంను పరిశీలించి, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలిపామన్నారు.

గ్యాస్ ఏజెన్సీపై చర్యలు లేవి?

వెల్దుర్తి ఎస్‌వీఆర్ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వినియోగదారులు, ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం ఏజెన్సీపై అవినీతి ఆరోపణలు రావడంతో సంబంధిత శాఖ అధికారులు వచ్చి పాత ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి ఫైళ్లు తీసుకెళ్లారు. ఏజెన్సీ నిర్వాహకుడు తన రాజకీయ పలుకుబడితో అధికారులతో కుమ్మక్కై చర్యలు తీసుకోకుండా జాగ్రత్త పడ్డాడు. కొద్దినెలల క్రితం చిన్నశంకరంపేట మండలం ధర్పల్లిలో, మంగళవారం వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచలో ఖాళీ సిలిండర్‌లో రీఫిల్ చేస్తూ పట్టుబడడం ఏజెన్సీ అక్రమాలకు అద్దం పడుతున్నాయి. మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన గడ్డె లక్ష్మీబాయి గ్యాస్ బుక్ చేసుకున్నట్లు, సిలిండర్ డెలివరీ చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. లక్ష్మీబాయి భర్త స్వామి ఈ విషయమై ఏజెన్సీ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా పొరపాటు జరిగిందని చెప్పారు. మంగళవారం రాత్రి సైతం మరోసారి ఇలాంటి మెసేజ్ వచ్చినట్లు స్వామి తెలిపాడు.

ఉపాధి పనుల పరిశీలనలో అధికారులు విఫలం


ఝరాసంగం, సెప్టెంబరు 25: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను పర్యవేక్షించడంలో అధికారులు విఫలమయ్యారని మాచ్నూర్ గ్రామానికి చెందిన రైతు ప్రశాంత్ జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయారు. బుధవారం ఝరాసంగంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 14వ విడత ఉపాధిహామీ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఉపాధిహామీ ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా విధులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఉపాధిహామీ పథకంలో మామిడిచెట్లను సాగుచేసినా ఏడాదిగా రికార్డులు చేయకుండా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కూలీలకు సంబంధించిన మస్టర్లపై పంచాయతీ కార్యదర్శులు సంతకాలు చేయడం లేదని తనఖీల బృందం సభ్యులు తెలిపారు. దీంతో ఏపీడీ బాల్‌రాజు వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బిడెకన్నలో చేపట్టిన ఫీడర్‌చానెల్ పనుల్లో కొలతలు సక్రమంగా చేయకుండా సుమారు రూ.35 వేల బిల్లులు చెల్లించారని బృందం సభ్యులు సమావేశంలో అధికారులకు చెప్పారు. 2023-24లో మండలంలోని 33 గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీల నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో బాలరాజు, విజిలెన్స్ అధికారి నాగేశ్వరావు, ఎంపీడీవో సుధాకర్, ఏపీవో రాజ్‌కుమార్, జిల్లా క్యూసీ అధికారి సుభాష్, ఆయా గ్రామాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులు.. ఇక కాంట్రాక్టు టీచర్లు

● నియామకానికి సర్కారు గ్రీన్‌సిగ్నల్

● ఉమ్మడి జిల్లాలో 292 మంది అభ్యర్థులకు ఊరట

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : ఎట్టకేలకు 2008-డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. వివిధ కారణాలతో ఆ అభ్యర్థుల నియామక ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. గతంలో అభ్యర్థులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా 2008 డీఎస్సీ బీఈడీ అభ్యర్థులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకానికి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఒక ప్రకటన కూడా విడదల చేసింది. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మందికి ఊరట లభించనుంది. ఇలా ఉండగా వీరికి ఈ నెల 27 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేపడుతారు. ఆ క్రమంలో కాంట్రాక్టు పద్ధతిలో టీచర్లుగా పనిచేసేందుకు అంగీకరిస్తున్నట్లు అభ్యర్థుల నుంచి రాతపూర్వకంగా తీసుకుంటారు. వీరికి మినిమమ్ టైమ్ స్కేల్ వేతనం ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 17 ఏళ్ల నిరీక్షణకు తెరపడినట్టైంది.



సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లోని బీసీ గురుకుల పాఠశాల

ఒకే గదిలో..


తరగతి గదిలో ట్రంకు పెట్టెల మధ్య చదువులు

- ట్రంకు పెట్టెలు, బస్తాల మధ్య చదువులు
- ఓ వైపు గదుల కొరత.. వసతులు కరువు
- డైనింగ్ హాల్ లేక ఆరు బయటే భోజనాలు
- సమస్యల వలయంలో సంగారెడ్డిలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల

పగలు తరగతులు, రాత్రి బస

ఏ పాఠశాల తరగతి గదిలో చూసినా ఓ వైపు బ్లాక్ బోర్డు, మరో వైపు బెంచీలపై విశాలంగా కూర్చున్న విద్యార్థులు కనిపిస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం రేకుల తరగతి గదులు, ఆ గదుల్లోనే చుట్టూరా ట్రంకు పెట్టెలు, బస్తాలు, బకెట్లు, మగ్గులు ఇతర సామగ్రి కనిపిస్తాయి. వీటన్నింటి మధ్యలో ఇక్కడి విద్యార్థులు పగలు విద్యాభ్యాసం, రాత్రి పడుకోవడం చేస్తున్నారు. ఇదేక్కడో కాదు.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లోని బీసీ గురుకుల పాఠశాల దుస్థితి.

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లోని మహాత్మాజ్యోతిబాఫూలే బీసీ గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. 5 నుంచి 9 వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో సుమారు 300 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల జిల్లా పరిషత్‌కు చెందిన గెస్ట్‌హౌస్‌లో అద్దె ప్రాతిపదికన కొంత కాలంగా కొనసాగుతున్నది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే అరకొర వసతులు మధ్య నెట్టుకొస్తున్నారు.


తరగతి గదిలోని గ్రిల్స్‌కి తగిలించిన మగ్గులు, వాటర్‌బాటిల్స్, టూత్‌బ్రష్‌లు

తరగతిగదుల కొరత..

ఈ గురుకుల పాఠశాలలో తరగతి గదులు కొరత తీవ్రంగా ఉన్నది. రెండు పక్కా భవనాలతో పాటు రేకులు షెడ్డుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 10-12 గదులు ఉండగా.. ఏ మాత్రం సరిపోవడం లేదు. విచిత్రమేమంటే ఈ పాఠశాలలోని తరగతి గదుల్లో పగటి పూట ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు వింటుండగా, రాత్రిపూట ఇవే గదుల్లో నిద్రపోతారు. అంతే కాకుండా గదుల కొరతతో ఒకే గదిలో ట్రంకుపెట్టెలు, బ్యాగుల మధ్యలో విద్యనభ్యసించాలిసిన దుస్థితి నెలకొన్నది. డార్మెటరీ, తరగతిగది ఒక్కటే కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇక్కడి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రేకుల షెడ్డులోని గదుల్లో ఉండే విద్యార్థులు అటు వేసవి కాలంలో ఉకపోత, ఇటు వర్షాకాలంలో వానలకు ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు.

డైనింగ్ హాల్ లేక..

ఈ పాఠశాలలో విద్యార్థులు అల్పాహారం, భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేక ఆవరణలోని నేలపైనే కూర్చుని తింటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ పాఠశాలలో విద్యార్థులు పడుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీడీసీ చైర్మన్‌గా గడీల రాంరెడ్డి

● సంబురాల్లో కాంగ్రెస్ శ్రేణులు


గడీల రాంరెడ్డి

సదాశివపేట, సెప్టెంబరు 25: సంగారెడ్డి జిల్లా గణపతి షుగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఫసల్‌వాది (కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) సీడీసీ చైర్మన్‌గా సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన ప్రస్తుత సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడీల రాంరెడ్డి నియామకంతో సదాశివపేట మండల కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

వేర్వేరు ఘటనల్లో ట్రాలీఆటో డ్రైవర్, మహిళ దుర్మరణం

హవేళిఘణపూర్, సెప్టెంబరు25 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఔరంగబాద్ తండా శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంట గ్రామానికి చెందిన గామనగారి నరేష్‌గౌడ్(35) నందిని పాల ట్రాలీ ఆటో నడుపుతూ జీవించేవాడు. విధుల్లో భాగంగా మంగళవారం రాత్రి నందిని డైరీ పాల పాకేట్ల లోడుతో ఆటో కామారెడ్డి నుంచి మెదక్‌కు వెళ్తూ ఔరంగాబాద్ తండాశివారులో ఆగిఉన్న సిమెంట్ లారీని ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలైన నరేశ్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు,కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ దవాకానకు తరిలించారు. మృతుడి తండ్రి దుర్గాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

బైకు ఢీకొట్టడంతో మహిళ ..

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 25 : బైకు ఢీ కొట్టడంతో గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన కూచన్ మహేశ్వరి (50) బీడీ వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. బుధవారం ఉదయం పని నిమిత్తం వెళ్తూ రేణుకానగర్ వద్ద ప్రధాన రోడ్డు డివైడర్ దాటుతుండగా వెనకనుంచి అక్షయ్ అనే యువకుడు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన మహిళను గుర్తించిన స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు భానుప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యోగా శిక్షకుల పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : ఉమ్మడి జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన యోగా శిక్షకుల పోస్టుల భర్తీకి నేడు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అయూష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ నర్మదాషిండే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఉదయం 10.30 గంటల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 15 మేల్, 15 ఫిమేల్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

28న ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉమ్మడి మెదక్ జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో అండర్-19 బాలబాలికల విభాగంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు పదోతరగతి మెమో, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8106841226, 9948221330 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

కొండపాక, సెప్టెంబరు 25 : ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తేలు మహేశ్వరి(40) జ్వరం రావడంతో ఈ నెల 19న దుద్దెడలోని ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నది. అయినా పరిస్థితి విషమించడంతో మొదట సిద్దిపేట ఆసుపత్రికి, తరువాత అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఖర్చులను భరించలేక తిరిగి మంగళవారం వంటిమామిడి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కాగా, ఆర్ఎంపీ చేసిన చికిత్స వికటించడం వల్లనే తీవ్ర అనారోగ్యానికి గురైందని మృతురాలి భర్త నర్సింహులు హైదరాబాద్‌కు తరలించే సమయంలో ఆరోపించాడు. అప్పటినుంచి సదరు వైద్యుడు కనబడటంలేదు. విచారణ నిమిత్తం వచ్చిన వైద్యశాఖ అధికారులు ఆర్ఎంపీ అందుబాటులో లేకపోవడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. అయితే మహిళ మృతదేహాన్ని బుధవారం అంబులెన్సులో ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో దుద్దెడలో ఆపి ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్‌కు తీసుకెళ్లి ఆందోళనకు చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త నర్సింహులు అనారోగ్యంతోనే మృతి చెందినట్లు ఫిర్యాదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం


మహేశ్ (ఫైల్)

చేర్యాల, సెప్టెంబరు 25 : యువకుడు అదృశ్యమైన ఘటన చేర్యాల మండలం నాగపురి గ్రామలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన తలారి మహేశ్ కొంతకాలంగా చేర్యాల పట్టణంలోని మణికంఠ కిరాణాదుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఈ నెల 21న పనిమీద వెళ్లుండగా ఎదురుగా వచ్చిన వ్యక్తిని బైకుతో ఢీ కొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తికి గాయలపై మానసికంగా బాధపడుతున్నాడు. అయితే రోజులాగే బుధవారం దుకాణానికని చెప్పి వెళ్లిన మహేశ్ కొద్దిసేపటికి తిరిగి వచ్చి బైకు, సెల్‌ఫోన్‌ను ఇంటివద్ద ఉంచి ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫ్లైఓవర్‌పై నుంచి కారు పల్టీ

● ఆరుగురు ఉపాధ్యాయులు గాయాలు



జోగిపేట, సెప్టెంబరు 25: కారు ఫ్లైఓవర్‌పై నుంచి పల్టీ కొట్టగా.. ఆరుగురు టీచర్లకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని నేరడిగుంట, అక్సాన్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సంగారెడ్డి నుంచి ఒకే కారులో విధులకు వెళ్తుంటారు. బుధవారం కూడా కారులో బయలు దేరగా.. ప్రవీణ్ అనే ఉపాధ్యాయుడు డ్రైవ్ చేస్తున్నాడు. మాసాన్‌పల్లి శివారు జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్‌పై కారు అదుపుతప్పడంతో కారు కిందికి పల్టీ కొట్టి సర్వీసు రోడ్డుపై పడింది. ఈ ఘటనలో టీచర్లు ప్రవీణ్, వరలక్ష్మి, పూర్ణ చందర్, మధుసూదన్ రెడ్డి, రాంచందర్, ప్రవీణ, జ్యోతి రత్నకుమారిలకు గాయాలుకాగా, 108 వాహనంలో జోగిపేటలోని ఏరియా ఆసుపత్రి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

'గీతం'లో ప్రపంచ ఫార్మాసిస్ట్ డే

● మార్గదర్శనం చేసిన వక్తల ప్రసంగాలు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 25: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్ బుధవారం ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం 2024 ఘనంగా నిర్వహించారు. 'ప్రపంచ అవసరాలను తీరుస్తున్న ఫార్మాసిస్టులు అనే ఇతివృత్తం'తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నిపుణులు పాల్గొని ఫార్మా రంగ అభివృద్ధి, విస్తరణ, ఉపాధి అవకాశాలపై పలు సూచనలు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైదరాబాద్‌లోని ఔషధ నియంత్రణ మండలి(ఇండియా) డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ ఎం.రాం కిషన్ మాట్లాడుతూ ఔషధ నియంత్రణ మండలి విధులు, పాత్ర, ఔత్సాహిక ఫార్మాసిస్టులకు ప్రభుత్వ శాఖల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఔషధ భద్రత, నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చేయడంలో ఫార్మాసిస్టుల కీలకపాత్రను నొక్కి చెప్పారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న బొటానిక్ హెల్త్ కేర్ డైరెక్టర్, పరిశోధనా విభాగాధిపతి డాక్టర్ హెచ్.ఎస్.శివప్రసాద్, నివారణ ఆరోగ్య సంరక్షణకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని వివరించారు. మరో ఆత్మీయ అతిథి, కేర్ టీఆర్యూ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రియాంక దాస్, రోగి భద్రత, రక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. తొలుత, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథులను స్వాగతించి, సత్కరించారు, ఈ సందర్భంగా ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బప్పాదిత్య ఛటర్జీ జీ8 ఫార్మ నెక్సస్ పేరుతో రూపొందించిన తొలి పత్రికను ఆవిష్కరించారు. పలు పోటీల విజేతలకు బహుమతుల పంపిణీచేశారు.

తనువు చాలించారు..

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు బలవన్మరణం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వినాయక నిమజ్జనంలో తాగి డ్యాన్స్ చేయొద్దని తల్లి మందలించిందని ఒకరు.. భార్య పుట్టింటికి వెళ్లిందని మరొకరు ఇలా వేర్వేరు కారణాలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో కొందరు ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతిచెందారు.

● తల్లి మందలించిందని..


వంశీ(ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 25: వినాయక నిమజ్జనంలో తాగి డ్యాన్స్ చేయొద్దంటూ తల్లి అడ్డు చెప్పడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకున్నాడు. తూప్రాన్ ఎస్ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన జంగం బాలమణి, మల్లేశ్ దంపతులకు కుమారుడు జంగం వంశీ(18), కూతురు సంతానం. గ్రామంలో ఈనెల 21న రాత్రి వినాయక నిమజ్జనం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వంశీ తాగి నృత్యాలు చేస్తున్నాడు. తల్లి బాలమణి తాగి ఆడొద్దంటూ హెచ్చరించింది. దీంతో మనస్తాపానికి గురైన వంశీ తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే మేడ్చల్‌లోని మెడినోవా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

● కుటుంబ తగాదాలతో..


బాబు(ఫైల్)

శివ్వంపేట, సెప్టెంబరు 25 : అప్పుల బాధ, కుటుంబ కలహాలతో మనోవేదనకు గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శభాష్‌పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల పరకారం గ్రామానికి చెందిన బుడిగే బాబు (30) ఓ విత్తన పరిశ్రమలో పని చేస్తున్నాడు. రెండు నెలలుగా పనికి వెళ్లకపోవడంతో అప్పుల విషయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడిన బాబు మద్యం మత్తులో శభాష్‌పల్లి శివారులోని మూడుగుండ్ల మత్తడి చెక్‌డ్యామ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.

● ఆర్థిక ఇబ్బందులతో..

హవేళిఘణపూర్, సెప్టెంబరు 25 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అరిగె గోపాల్ (45) రైతు. కుటుంబ పోషణ, వ్యవసాయ పనుల నిమిత్తం అప్పులు చేశాడు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అప్పుల విషయమై మనోవేదనకు గురైన గోపాల్‌గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సమియోద్దీన్ తెలిపారు.

● భార్య పుట్టింటికి వెళ్లిందని..


పరశురాములు మృతదేహం

కొండపాక, సెప్టెంబరు 25 : భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన తాళ్లపల్లి పరశురాములు(40) తాగుడుకు బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ విషయమై 20 రోజుల క్రితం భార్య వాణి పుట్టింటికి జప్తినాచారం వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన పరశురాములు ఈ నెల 21న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నిప్పంటించుకున్న ఆటోడ్రైవర్..


విఠల్‌గౌడ్(ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 25: పోలీస్‌స్టేషన్‌లో ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్న ఆటో డ్రైవర్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం హత్నూర మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పటేల్ విఠల్ గౌడ్(29) ఈ నెల 17న దౌల్తాబాద్ నుంచి ఆటోలో ప్రయాణికులను తీసుకుని మల్కాపూర్ వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆటో సైడు ఇవ్వలేదని తిట్టడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలతో సహా ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘర్షణ విషయమై బస్సు డ్రైవర్ అనిల్ ఆటో డ్రైవర్‌పై ఫిర్యాదు చేస్తున్న క్రమంలో విఠల్‌గౌడ్ ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకోగా తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. గాంధీ ఆసుపత్రిలో తొమ్మిది రోజుల పాటు చికిత్స పొందిన ఆయన మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● చేవెళ్లలో అకౌంటెంట్..


శివకుమార్(ఫైల్)

అల్లాదుర్గం, సెప్టెంబరు 25 : ఇంట్లో చెప్పి బయటికెళ్లిన ఓ యువకుడు చెక్‌డ్యాంలో శవమై తేలిన సంఘటన అల్లాదుర్గం మండలం చేవెళ్లలో బుధవారం వెలుగుచూసింది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చెన్న శివకుమార్ (30) సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న ఇంట్లో పెద్దల పండగ నిర్వహించగా స్వగ్రామానికి వచ్చిన శివకుమార్ 23న సంగారెడ్డికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. కాగా, బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెక్‌డ్యాంలో శివకుమార్ మృతదేహం తేలడంతో రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో అతడు ఆత్మహత్యకు చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు..

వివిధ ఘటనల్లో పలువురి మృతి

● జారి కిందపడి రైతు మృతి


రమేష్ మృతదేహం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 25 : చేపల వేటకు వెళ్లిన రైతు మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు బుస్స రమేష్ (45) మంగళవారం ఇంట్లో నుంచి చేపలు పట్టేందుకు పెద్దమ్మకుంట వద్దకు వెళ్తున్నాని చెప్పి బయలుదేరాడు. తన సొంత పొలం ఒడ్డుపై నడుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు పొలం వద్దకు వెళ్లి చూడగా ఒడ్డుకింద విగితజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య మైసమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

● కెనాల్‌లో పడి..


కిష్టయ్య మృతదేహాన్ని బయటకు తీసున్న దృశ్యం

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 25: కెనాల్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ మండల పరిధిలోని దాతర్‌పల్లి గ్రామంలోని కెనాల్‌లో వ్యక్తి మృతదేహం లభించింది. సమచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా.. మృతుడు అలిరాజుపేట గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్యగా గుర్తించారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● పిడుగు పడి గేదెల కాపరి..


జాటి పటేల్ (ఫైల్)

గుమ్మడిదల, సెప్టెంబరు 25 : పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథన ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన జాటి పటేల్(36) అన్నారం గ్రామంలో కటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. గ్రామంలోనే ఒకరి వద్ద గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. 24న గేదెలను యజమానికి కొడకుతో కలిసి మేతకు తీసుకెళ్లగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. అయితే యాజమాని కుమారుడు గేదెలను తోలుకొని ఇంటికి రాగా, జాటీ పటేల్ మాత్రం రాత్రి అయినా ఇంటికి రాలేదు. బుధవారం ఊరు బయట పడి ఉన్నాడని సమాచారం అందుకున్న అతని భార్య సంజుక్తా అక్కడికి వెళ్లి చూడగా మృతి చెంది కనిపించాడు. పిడుగుపాటుకు తన భర్త మృతి చెందాడని, ఎలాంటి అనుమానాలు లేవని మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● విద్యుదాఘాతంతో రైతు..

హవేళిఘణపూర్, సెప్టెంబరు 25 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన కప్రాయిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజిపేటతండా గ్రామపరిధిలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన కుక్కల రాజు (25) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు బోరు ఆన్ చేసే క్రమంలో స్టార్టర్‌లోని వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పతికి తరలించారు. భార్య విజయ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జిగా వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, సెప్టెంబరు 25: భారతీయ కిసాన్ సంఘ్ హుస్నాబాద్ డివిజన్ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన కవ్వ వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. సిద్దిపేటలో బుధవారం నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గ ఏర్పాటు సందర్భంగా సంఘం మూడు రాష్ట్రాల ఇన్‌చార్జి రామ్ హుస్నాబాద్ డివిజన్ ఇన్‌చార్జిగా తనను నియమించినట్లు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న

హత్నూర, సెప్టెంబరు 25: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న పేర్కొన్నారు. బుధవారం హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో విస్తృతంగా వైద్య సేవలందించాలని సూచించారు. ఏ గ్రామంలోనైనా జ్వరాలు ఎక్కువగా ఉంటే అక్కడ హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. రక్షిత మంచినీటి పైపులైన్లు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల పని తీరుపై సమీక్షలో నివేదికను కోరారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వట్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాజలింగం

వట్‌పల్లి, సెప్టెంబరు 25: వట్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బొర్రా రాజలింగం బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శశిప్రభ అనారోగ్య సమస్యతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో మునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజలింగంను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వచ్ఛత ప్రతీ ఒక్కరి బాధ్యత

● స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 25: స్వచ్ఛత ప్రతీ ఒక్కరి బాధ్యతని డీపీవో యాదయ్య పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని కామారం, మిర్జాపల్లి, రుద్రారం, తదితర గ్రామాల్లో డీపీవో పర్యటించి డ్రైనేజీలు, ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల వద్ద వ్యర్థసామగ్రిని తొలగింపజేసి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లను పరిశీలించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సవరణపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు ఇచ్చారు. వెంట ఎంపీవో గిరిజారాణి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: మండల పరిధిలోని చిలప్‌చెడ్, చండూరు, రహీంగూడా రాందాస్‌గూడా బండాపోతుగల్ గ్రామాల్లో బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాదిక్ ఎంపీడీవో ఆనంద్, ఆయా గ్రామాల కార్యదర్శులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● తూప్రాన్: మండలంలోని నాగులపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నాగులపల్లిపల్లె ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సునీతా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి కార్మికులకు అవసరమైన మందులు అందజేశారు. నాగులపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీడీవో శేషాద్రి సందర్శించారు.



మనోహరాబాద్: పీహెచ్‌సీలో కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య అధికారి వికాస్

● మనోహరాబాద్: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి వికాస్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల జీపీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు బీపీ, రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో లక్ష్మీ నర్సింలు, వైద్యులు జోస్నాదేవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

● వెల్దుర్తి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పంచాయతీ కార్మికుల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



నారాయణఖేడ్: చెత్తతో ఎరువుల తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

● నారాయణఖేడ్: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ బుధవారం పట్టణ శివార్లలోని డంపు యార్డు వద్ద విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పట్టణానికి చెందిన అంకూర్ పాఠశాల విద్యార్థులను డంపుయార్డు వద్దకు తీసుకెళ్లి తడి,పొడి చెత్త హానికరమైన చెత్తను వేర్వేరుగా ఉంచుతున్న విధానాన్ని, చెత్తతో ఎరువులను తయారు చేసే విధానంపై వారి వివరించి, గృహాల వద్దపరిశుభ్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, సద్దాం, హన్మండ్లు, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు స్వచ్ఛతాహి కార్యక్రమంపై కమిషనర్ అవగాహన కల్పించారు.

● కంది: గ్రామ పంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిశంకర్ సూచించారు. బుధవారం మండలకేంద్రమైన కందిలోని పంచాయతీ కార్మికులకు, పారిశుధ్య సిబ్బందికి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి విద్యాధర్, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



శ్రీనివాస్ చారి(ఫైల్)

పెద్దశంకరంపేట,సెప్టెంబరు 25: ప్రమాదవశాత్తు తిరుమలాపూర్ చెరువులోపడి బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పెద్దశంకరంపేట ఏఎస్ఐ సునీత, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన టైలర్ అవుసుల శ్రీనివాస్‌చారి(58) మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బుధవారం ఉదయం తిరుమలాపూర్ చెరువులో అతడి మృతదేహం తేలింది. ఇది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృత దేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత కంటివైద్య శిబిరంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

కొండాపూర్, సెప్టెంబరు 25: కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం, డాక్టర్లు గ్రామీణ ప్రాంతాల నిరుపేదలకు ఉచిత సేవలు అందించడం అభినందనీయమని సంగారెడ్డి జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తొగర్‌పల్లిలో హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా ట్రైనీ కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ ఉచిత సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారి రమామణి, జీపీ కార్యదర్శి నర్సమ్మ, వైద్యులు అఖిల, రసజ్ఞ, శంకర అసుపత్రి డాక్టర్లు, సిబ్బంది బాలరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పనిచేయని లిఫ్టు

● అధికారులు, ఉద్యోగుల ఇక్కట్లు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 25 : సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో గత వారం పది రోజులుగా లిఫ్టు పనిచేయడం లేదు. కలెక్టరేట్‌లోని మొదటి, రెండో అంతస్తులోల్ల వివిధ శాఖల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది లిఫ్టు పనిచేయకపోవడంతో మెట్ల ద్వారా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ శాఖలకు పలు పనుల మీద వచ్చే మహిళలు, వృద్ధులు నడవలేక నరకయాతన పడుతున్నారు. లిఫ్టుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

జిన్నారం, సెప్టెంబరు 25: బొల్లారం మున్సిపాలిటీలోని పలు వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహాకు కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహాను బొల్లారం కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ తదితరులు కలిసి 19వ వార్డులో సీసీ రహదారులు, మిషన్ భగీరథ సమస్యలు, అసంపూర్తి పనుల గురించి వివరించారు. సమస్య పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ఈ పరీక్ష ఫీజు చెల్లించండి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎగ్జామినేషన్(ఎన్‌ఎంఎంఎస్‌ఈ) పరీక్ష ఫీజు చెల్లించే గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు అక్టోబరు 1వ తేదీ వరకు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 25: చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ సూచించారు. బుధవారం సప్లిమెంటరీ సూపర్‌వైజర్ ఫీడింగ్ ప్రోగ్రాంలో భాగంగా కొర్విపల్లి గ్రామంలోని చిన్నారులకు అవసరమైన వైద్య సేవలందించి, బరువులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కుమారి, ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగమ్మ, మంజుల, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను బడికి వచ్చేలా ప్రోత్సహించాలి

కౌడిపల్లి, సెప్టెంబరు 25: పాఠశాలకు రాని విద్యార్థులను పాఠశాలకు వచ్చేలా చేయాలని మెదక్ డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో రెండు రోజులు ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశానికి హాజరై ఎన్ఏఎస్ పరీక్షల (ఎఫ్ఎల్ఎన్) ఫౌండేషన్ లిటరసీ న్యూమరాలజీపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వాటర్ మన్‌లకు శిక్షణ

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 25: మండలంలోని పలు గ్రామాల్లో వాటర్ మన్‌గా విధులు నిర్వహిస్తున్నవారికి బుధవారం జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోటార్ల నిర్వహణ, ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా, నీటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్, డీఈ పల్లవి, ఏఈలు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం

నర్సాపూర్, సెప్టెంబరు 25: నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో బుధవారం సరోజినిదేవి కంటి ఆసుపత్రి, ఇన్నర్ వీల్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సరోజిని కంటి ఆసుపత్రి డాక్టర్లు కంటి పరీక్షలు చేసి, అద్దాలు, మందులు పంపిణీ చేశారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం: ఖేడ్ ఎమ్మెల్యే



ఖేడ్‌లో లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్,సెప్టెంబరు 25: రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నారాయణఖేడ్ పరిధి నిజాంపేట మండలకేంద్రంలోని పీహెచ్‌సీని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలో రోగులకు వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీశారు. మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా?అనే విషయాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. వెంట వైద్యాధికారి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన పశువుల యజమానులకు విద్యుత్ శాఖ తరఫున బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆర్థిక సహాయం చెక్కులు అందించారు. మండలంలోని పీర్ల తండాకు చెందిన హరిసింగ్‌కు, కల్హేర్ మండలం క్రిష్ణాపూర్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణకు, సిర్గాపూర్ మండలం వంగ్దల్‌కు చెందిన సావినాయక్‌లకు ఒక్కొక్కరికి రూ.40 వేల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, సేవాలాల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ర్యాకల్ గ్రామానికి చెందిన కుమ్మరి అంజమ్మ, వెంకటాపూర్‌కు చెందిన లక్ష్మి, అంబాదాస్‌లకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందించారు. నిజాంపేట మండలంలోని మునిగేపల్లిలో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలోఎంపీడీవోరమేష్ బాబు, ఎంపీవో శ్రీనివాస్, తహసీల్దార్‌నాగజ్యోతి, నాయకులు రాములు, రఘుపతిరెడ్డి, రాధాకిషన్, వెంకటేష్, శ్రీకాంత్, తోఫిక్, మిస్కిన్,రమేష్, సంగమేష్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంఈవోలు



కృష్ణారెడ్డి,ఎంఈవో, చౌటకూర్

పుల్‌కల్/జిన్నారం/కల్హేర్/రాయికోడ్/నాగల్‌గిద్ద/, సెప్టెంబరు 25: చౌటకూర్ మండల విద్యాశాఖ అధికారిగా జి.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. మండల కేంద్రం చౌటకూర్ జిల్లా పరిషతు ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి నవంబరు 30న పదవీ విరమణ చేయనున్నారు. మండలంలో అత్యంత సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న ఆయనను ఎంఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డిని సహచర ఉపాధ్యాయులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కాగా, చౌటకూర్ జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా విజయలక్ష్మిని నియమించారు. అదేవిధంగా జిన్నారం మండల ఎంఈవోగా కుమారస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కల్హేర్ మండల విద్యాధికారిగా కల్హేర్ ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎం జి. శ్రీనివాసులు, సిర్గాపూర్ ఎంఈవోగా సిర్గాపూర్ ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎం నాగారం శ్రీనివాస్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాయికోడ్ మండల ఎంఈవోగా రాయికోడ్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.అంజయ్య పదవీ బాధ్యతలు చేపట్టారు. నాగల్‌గిద్ద మండల విద్యాధికారిగా హీరామన్‌ను నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

మెదక్ జిల్లాలో..

●చిన్నశంకరంపేట/హవేళిఘణపూర్/చేగుంట/రేగోడు/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/నిజాంపేట/పాపన్నపేట/చిలప్‌చెడ్/కౌడిపల్లి, సెప్టెంబరు 25: చిన్నశంకరంపేట ఎంఈవోగా పుష్పవేణి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. మిర్జాపల్లి హైస్కూల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న పుష్పవేణి మండల నోడల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవోగా పదవి బాధ్యతలను చేపట్టారు. హవేళిఘణపూర్ మండల విద్యాధికారిగా మధు మోహన్ బాధ్యతలు స్వీకరించారు. చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసిన నీరజ చేగుంట మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రేగోడు మండల విద్యాధికారిగా టి లింగంపల్లి హెచ్ఎం గురునాథ్ బాధ్యతలు స్వీకరించారు. అల్లాదుర్గం ఎంఈవోగా ధనుంజయగౌడ్ బాధ్యతలను స్వీకరించారు. పెద్దశంకరంపేట మండల విద్యాధికారిగా డి.వెంకటేశం నియమితులయ్యారు. బుధవారం పేట ఎమ్మార్సీలో మండల విద్యాధికారిగా వెంకటేశం బాధ్యతలు స్వీకరించారు. నిజాంపేట మండల విద్యాధికారి సంగేపు యాదగిరి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే కళాఉత్సవ్‌లో పాల్గొన్నారు. అదేవిధంగా పాపన్నపేట మండల విద్యాధికారిగా ప్రతాప్‌రెడ్డి, చిలప్‌చెడ్ మండల నూతన ఎంఈవోగా విఠల్, కౌడిపల్లి ఎంఈవోగా బాలరాజు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. కాగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన ఎంఈవోలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

నలంద జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డేలో విద్యార్థినులు

తూప్రాన్, సెప్టెంబరు 25: విద్యార్థులు చదువుతోపాటు గురువులు, పెద్దల పట్ల గౌరవంతో కృతజ్ఞతా భావంతో ఉంటే అంచెలంచలుగా ఎదుగుతామని నలందా విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పీవీ రమణ పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ నలంద జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఫ్రెషర్స్ డేలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, పట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గుమ్మడిదల, సెప్టెంబరు 25: కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు అనవసర విమర్శలు మానుకోవాలని మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు చేసిన పొరపాటు నేడు మండలానికి శాపంగా మారిందన్నారు. అప్పుడే ప్యారానగర్‌లో డంప్ యార్డు నిర్మాణ అనుమతులు రద్దు చేసినట్లయితే మండలానికి ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తాము డంప్ యార్డు వ్యతిరేకిస్తూ మంత్రి దామోదర్ నర్సింహాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు, మద్ది ప్రతాప్ రెడ్డి, తులసీ దాసు, ఎం. నరేందర్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, కవ్వం రవీందర్ రెడ్డి, బాలక్రిష్ణ గౌడ్, విప్పరాంరెడ్డి, నర్సింలు ఇతర మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బదిలీ అయిన 17 మంది ఉపాధ్యాయులకు సన్మానం



హత్నూర: మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హత్నూర, సెప్టెంబరు 25: హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచునూర్‌కు చెందిన 17 మంది ఉపాధ్యాయులు ఏక కాలంలో బదిలీ అయ్యారు. మోడల్ స్కూల్ ఏర్పాటు అయిన నాటి నుంచి సుమారు 12ఏళ్లుగా ఒకే పాఠశాలలో విద్యార్థులకు బోధన చేసి ఎంతో మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దారు. అలాంటి ఉపాధ్యాయులు ఏకకాలంలో బదిలీపై వెళ్లడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవో 25ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

● చిన్నశంకరంపేట: జీవో 25ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం చిన్నశంకరంపేట మోడల్ స్కూల్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూటీఎస్ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: ఇటీవల ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోను రద్దు చేయాలని కోరుతూ మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం కాంప్లెక్స్ సమావేశంలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకటకృష్ణ, సత్యనారాయణ, సునీల్ మహేష్ బిక్షపతి, బుచ్చిరాములు నరేందర్‌రెడ్డి నరేష్, అనిత ఉమారాణి, శ్రీకాంత్ లావణ్య, కరుణశ్రీ, ఉషశ్రీ ప్రత్యూష, విశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

పీఆర్టీయూ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

చిలప్‌చెడ్ సెప్టెంబరు 25: పీఆర్టీయూ చిలప్‌చెడ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ చిలప్‌చెడ్ సర్వసభ్య సమావేశంలో 2024 -26కు గాను చిలప్‌చెడ్ మండలాధ్యక్షుడిగా బి సునీల్, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరాములు, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వాణీదేవి, కార్యదర్శిగా నర్సింలు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ..

● మాసాయిపేట: మాసాయిపేట మండలం టీపీటీఎఫ్ నూతన మండల కమిటీని బుధవారం మాసాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘం సర్వ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ మహబూబ్ భాష, ప్రధాన కార్యదర్శిగా పాతూరి స్వప్నశ్రీ, ఉపాధ్యక్షులుగా రాజమణి, శ్యాంసుందర్, కార్యదర్శిగా సత్యానందం, హరికిషన్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్‌గా నరేందర్‌రావును ఎన్నుకున్నారు.

నిందలు వేయడం సరికాదు: బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్నచిమ్ముల గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, సెప్టెంబరు 25 : రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ పార్టీ నాయకులు డంప్ యార్డుపై మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించడం సరికాదని రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ పై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బుధవారం మండల కేంద్రంలోని గోవర్ధన్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ ప్రభుత్వ భూములలోనే డంప్ యార్డు నిర్మాణం ఏర్పాటు జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించడం వాస్తవం కాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇక్కడ డంప్ యార్డు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం అయినట్లు ఆ పార్టీ నాయకులకు తెలుసని వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ డంప్ యార్డు ఏర్పాటుకు అడ్డుకునే దిశగా పోరాటం చేసేందుకు ప్రజల తరఫున కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు చిమ్ముల నరసింహారెడ్డి, శ్రీనివాస్, రాశేఖర్, హనుమంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హిందూ ఆలయాలను పరిరక్షించాలి: దేవాలయ పరిరక్షణ సమితి

మనూరు, సెప్టెంబరు 25:ఎండోమెంట్ వ్యవస్థను రద్దు చేసి, హిందూ దేవాయాలను పరిరక్షించాలని ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు సాయిరాం, ఈశ్వరప్ప, రాజగిరి శ్రీనివాస్, చాకలి అశోక్, రాజుపాటిల్, దుద్దగొండ, నరేష్‌రెడ్డి, గణేష్ పేర్కొన్నారు. బుధవారం మనూరు ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ ఎమ్మార్వోకు దేవాలయ పరిరక్షణ సమితి సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేవాలయ నిర్వహణ బాధ్యతలను సాధు సంతులు, సనాతన ధర్మ పరిరక్షణకు అప్పగించాలన్నారు. హిందూ దేవాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అన్య మతస్థులను తొలగించాలని, నూతన ఉద్యోగాల భర్తీలో అన్యమతాల వారి ప్రవేశాన్ని నిషేధించాలన్నారు. ఆలయాల ఆదాయాన్ని హిందూ ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించవద్ద డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖకు చెందిన భూములను హిందువులకు మాత్రమే అద్దెకు ఇవ్వాలన్నారు. గో హత్యపై చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. దేవాదాయ శాఖ భూములును అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో దేవాలయ పరిరక్షణ సమితి సభ్యులు డోవూర్ జైపాల్, గాజుల ప్రశాంత్, మల్లయ్యస్వామి, దత్తురెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి

● సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా ఉండాలని, న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో వివరించారు. గృహహింస, బాల్య వివాహ నిషేధచట్టం, పోక్సో చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమయానికి బస్సు నడపాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 25: గత కొన్ని నెలల నుంచి బస్సు సమయానికి రాకపోవడంతో పాఠశాలలకు, కళాశాలలకు చేరుకోలేకపోతున్నామని ఆగ్రహిస్తూ బుధవారం రామాయంపేట, గవ్వలపల్లి రహదారిపై ఖాజాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కొన్ని నెలల నుంచి బస్సులు సమయానికి నడుపడంలేదని, ఆటోలో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడంతో సమయానికి చేరుకోక చదువులు దెబ్బతింటున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు సమయానికి నడిపించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నా ఆందోళనకు దిగారు. గ్రామస్థులు ఎమ్మెల్యే రోహిత్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో మెదక్ డిపో మేనేజర్‌కు సమయానికి బస్సులు వేయాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి: డీఎల్పీవో

కంది, సెప్టెంబరు 25: గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని డీఎల్పీవో అనిత పిలుపునిచ్చారు. మండలపరిధిలోని ఎద్దుమైలారంలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. డంపుయార్డు వద్ద తడిచెత్తతో ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ సిబ్బందికి నెలవారిగా అందించాల్సిన సబ్బులు, నూనెలు తదితర వస్తువులను డీఎల్పీవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వెంట ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

పండిత్ దీన్‌దయాల్ గొప్ప మానవతావాది

● సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో జయంతి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25: జనసంఘ్ వ్యవస్థాపకుడు, పార్టీ సిద్ధాంత కర్తల్లో ఒకరైన పండిత్ దీన్‌దయాల్ గొప్ప మానవతావాది అని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కొనియాడారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ సిద్ధాంతకర్త పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గోదావరిఅంజిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండిత్‌దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆలోచన, ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మీనాగౌడ్, గోపాల్, లక్ష్మణ్ గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

● జహీరాబాద్: బీజేపీ వ్యవస్థాపకుడు పండిత్ దీనదయాల్ జయంతి సందర్భంగా జహీరాబాద్‌లో బీజేపీ నాయకులు బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు బీజేపీనాయకులు మాట్లాడుతూ పండిత్‌దీనదయాల్ ఆశయ సాధనకు మనందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, నౌబాద్ జగన్, బక్కయ్య గుప్తా, గొల్లభాస్కర్, అప్పం శ్రవణ్, నాయకులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: ఖేడ్‌పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖేడ్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రజనీకాంత్, బీజేపీ అనుబంధ సంఘాల జిల్లా, స్థానికబాధ్యులు సతీష్‌కుమార్, పట్నంమాణిక్, భూంరాజ్, సాయిసాగర్, సాయేందర్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో పండిత్‌దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షురాలు

● మనూరు: మనూరులో పండిత్‌దీన్‌దయాళ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, మండల అధ్యక్షుడు కర్ణ ఈశ్వరప్ప, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

● మెదక్ అర్బన్, సెప్టెంబరు 25: పండిత్ దీన్‌దయాళ్ అడుగుజాడలు అనుసరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు, పార్టీ సిద్ధాంతకర్తల్లో ఒకరైన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు ఉన్నారు.



బీజేపీ మెదక్ జిల్లా కార్యాలయంలో దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు

● అల్లాదుర్గం: మండలకేంద్రంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు కాళ్ల రాములు, కంచరి బ్రహ్మం ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

● పెద్దశంకరంపేట: భారతదేశానికి పండిత్‌దీన్ దయాల్ ఉపాధ్యాయ చేసిన సేవలు చిరస్మరణీయమని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, టెంకటి మాజీ సర్పంచు సుధాకర్, నాయకులు బుగుడాల కృష్ణ, సుభాష్, మంగలి కృష్ణ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రోడ్డును వేయించండి

● సంగారెడ్డి కలెక్టర్‌కు సీపీఎం నాయకుల వినతి

మునిపల్లి, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని 72 ఇళ్లవారికి తమ ఇళ్లకు వెళ్లేందుకు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు బుధవారం సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు బుధవారం మునిపల్లికి విచ్చేసిన కలెక్టర్‌కు సీపీఎం నాయకులతో కలిసి గ్రామ మాజీ ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద సీసీ రోడ్డు వేస్తామని శంకుస్థాపనలు చేసి రెండేళ్లు గడిచినా, ఇప్పటి వరకు రోడ్డు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షం పడితే ఆ రోడ్డు నడిచేందుకే దుర్భరంగా ఉందని తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.